


## భూసేకరణ వేగవంతం చేయాలి



**ప్రజాశక్తి-గూడూరు:** భూసేకరణ వేగవంతం చేయాలని ఆర్డీవో కిరణ్‌కుమార్ సూచించారు. మంగళవారం గూడూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో చిల్లకూరు, కోట తహసీల్దార్లు, ఆర్‌ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లతో ఆయన సమీక్షించారు. సాగర్ మాల ప్రాజెక్టు లబ్ధిదారులకు నష్టపరిహారం చెల్లింపుపై చర్చించారు. డివిజనల్ పరిపాలన అధికారి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'ఎక్సైజ్ శాఖ' అండతో...

# ఆ బార్‌లో ఎనీ టైం మందు

• ప్రభుత్వ దుకాణాలు గంటముందే మూత

**ప్రజాశక్తి - నాయుడుపేట**

అధికార పార్టీ, అధికార యంత్రాంగం ఒక్కటైతే ఇంకా తిరుగేముంది.. వారి కనుసన్నల్లోనే ఏ పనైనా ఇట్టే అయిపోతుంది.. అదే జరిగింది నాయుడుపేటలోనూ... ఎక్సైజ్ శాఖ అండతో బార్‌లో 24 గంటలూ మందు సప్లై అవుతోంది.. అదీ ఎలాగంటే ప్రభుత్వ మద్యం దుకాణాన్ని గంటన్నర ముందే నిబంధనలకు విరుద్ధంగా మూయించేసి మరీ.. ప్రభుత్వ దుకాణం మూసివేసి, అధిక ధరలతో బార్‌లో ముందు అమ్మడాన్ని మందుబాబులు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ కూలీల డబ్బును కొల్లగొడుతున్నారు.

రాష్ట్ర మంతా మద్యం దుకాణాలు రాత్రి తొమ్మిది గంటలవరకు నిర్వహిస్తుంటే ఒక్క నాయుడుపేటలో మాత్రం అందుకు బిన్నంగా ఎనిమిది గంటల ముప్పై నిమిషాలకే మూసేస్తున్నారు. అంతేకాదు లక్షల్లో వ్యాపారం జరిగే షాపులను సైతం ఎటువంటి కారణాలూ లేకుండా అక్కడనుంచి తరలించేస్తున్నారు అదేమని ఎవరైనా అధికారులను వివరణ కోరితే చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఒక వ్యక్తి నిర్వహిస్తున్న బార్ కోసం అధికారులు ప్రభుత్వ ఖజానాకు సైతం గండి కొడుతున్నారు. నాయుడుపేటలో గత ఎనిమిదేళ్ల నుంచి బార్ నిర్వహిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చి ప్రభుత్వ మద్యం షాపులు తెచ్చాక కూడా ముందున్న బార్




నిర్వాహకులు వారి వ్యాపారాలు వారు చేసుకునే వాళ్ళే కానీ పక్క షాపుల బిజినెస్‌లో జోక్యం చేసుకునేది కాదు. అయితే అప్పట్లో ఇరవై లక్షలున్న బార్ లైసెన్సును వైసీపీ కి చెందిన వ్యక్తి ఇష్టానుసారంగా ఒక కోటి ముప్పై ఐదు లక్షలకు పెంచేశారు. అప్పటి నుంచి బార్ నిర్వహణ వారిష్టానుసారం నిర్వహిస్తున్నారు. ఆ బార్లో మద్యం విక్రయానికి సమయమంటూ లేదు. ఏ సమయంలోనైనా దొరుకుతుంది. వీరి వ్యాపారం కోసం ఈ బార్ కు దరిదాపుల్లోని ఏ ప్రభుత్వ మద్యం షాపును ఉండనివ్వటం లేదన్నది అక్షర సత్యం. అందుకు అధికారులు సైతం వంతపాడటం ఇక్కడ చెప్పుకోవలసిన విశేషం. నాయుడుపేటలోనే అత్యధిక వ్యాపారం జరుగుతూ లక్షల్లో ఆదాయం వస్తున్న రెండు షాపులను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అక్కడనుంచి తొలగించటమే ఇందుకు నిదర్శనం. సదరు బార్ నిర్వాహకుడైన అధికార పార్టీ వ్యక్తి జేబు నింపేందుకు అధికారులు సైతం విధి విధానాలను తుంగలో తొక్కి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతుండడం శోచనీయం. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి రాష్ట్రమంతా అమలులో ఉన్న సమయాన్ని కుదించి నాయుడుపేటలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి అరగంట ముందే మూసేస్తున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ ఎస్సై, సీఐలను వివరణ కోరేందుకు ప్రయ్నతించినా వారు స్పందించకపోవడం గమనార్హం. ఎక్సయిజ్ సీఐ కిషోర్ 'ఔనా ముందుగానే మూసేస్తున్నారా.. నేను విచారిస్తాను' అని నమ్మశక్యం కాని వివరణ ఇవ్వడం ఆ శాఖ ఎంతగా ఆ బార్‌కు 'సపోర్టు'గా ఉందో ఇట్టే అర్థమవుతోంది.

తిరుమలలో నిఘా వైఫల్యానికి

# బాధ్యులెవరు..?

అఖిల పక్షం

**ప్రజాశక్తి- తిరుపతి(మంగళం)**

తిరుమలలో తరచూ నిఘా వైఫల్య డొల్లతనం కనబడుతోందని, ఇటువంటి సంఘటనలతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు ఆందోళన చెందుతున్నారని, తిరుమల పవిత్రతకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ మాట్లాడుతూ తిరుమల పవిత్రతను ఎవరు కాపాడతారని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి బస్సు టికెట్లపై అన్యమత ప్రచారాలు, తిరుమలలో సిలువ వివాదం, కొద్ది రోజులకు ముందు అవుట్సోర్సింగ్ సిబ్బంది వద్ద పట్టుబడ్డ గంజాయి, రెండు రోజుల ముందు ఆనంద నిలయాన్ని వీడియో తీసిన భక్తుడు ఇలా అనేక సంఘటనలు తిరుమల కొండపై జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇంత జరుగుతున్న తిరుమలలో నిఘా వ్యవస్థను పటిష్ట పరచడంలో అధికారులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారో అర్థం కావడం లేదన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా సేకరించిన నిధులు వాటి వ్యయాలను శ్రీవారి భక్తులకు తెలపాల్సిన అవసరం టీటీడీకి ఉందన్నారు. జనసేన పార్టీ పీఏసీ సభ్యులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ వరుస సంఘటనలతో తిరుమల వార్తల్లోకి ఎక్కుతోందని, భక్తులు, స్థానికులు టీటీడీ నిఘా వైఫల్యంపై చర్చించుకుంటున్నా ఇటు అధికారులు గానీ, అటు ధర్మకర్తల మండలిలో కానీ ఎవరూ స్పందించకపోవడం హైందవ ఆలయాల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ఈ రూపంలో తెలియజేస్తూ ఉన్నారా అనే అనుమానం వ్యక్తం చేశారు.

తిరుమల ఆనంద నిలయంపై విమాన రాకపోకలు నిశ్శబ్దం అయినా ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయన్నా రు. జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ ఇన్చార్జ్ కిరణ్ రాయల్ మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు టీటీడీ నిఘా వైఫల్యం బట్టబయ లైందని, త్వరలో మూలవిరాట్ ను చిత్రీకరిం చిన వీడియో కూడా బయటకు వస్తుందేమో నన్నారు. వరుస నిఘా వైఫల్య ఘటనలపై బుధవారం టిటిడి పరిపాలన భవనాన్ని అఖిల పక్ష పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ముట్టడిం చి ధర్నా చేస్తామని, టీటీడీ చైర్మన్, కార్యనిర్వహణాధికారి వచ్చి సమాధానం చెప్పే వరకు ధర్నాను విరమించబోమన్నారు. కార్యక్రమం




## 'డైకిన్' సంస్థకు శ్రీసిటి ప్రశంసలు



**ప్రజాశక్తి - వరదయ్యపాలెం:** ఎయిర్ కండీషనర్ తయారీ సంస్థ డైకిన్ ఇండియా దేశీయ మార్కెట్లో కీలక బిలియన్ డాలర్ల టర్నోవర్ మైలురాయిని అధిగమించినందున ఆ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కన్వల్జీత్ జావాకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. శీతలీకరణ పరిశ్రమలో 2023 ఆర్థిక సంవత్సరానికి ఒక బిలియన్ డాలర్ల మార్కును అధిగమించిన మొట్టమొదటి అంతర్జాతీయ కంపెనీగా డైకిన్ ఇండియా ఆవిర్భవించినందుకు తాను సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. డైకిన్ విజయ ప్రస్థానం ఇతరులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. యువతకు ఉపాధి కల్పనపై దష్టి సారించి శ్రీసిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ హబ్‌ని స్థాపించడానికి డైకిన్ చూపుతున్న చొరవ అత్యంత ప్రశంసనీయమని అన్నారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి



**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్, పెన్షనర్ల సంఘం జిల్లా సహాధ్యక్షులు టి.గోపాల్ ఆధ్వర్యంలో ట్రెజరీ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న డిఎ, కరువు భత్యం, అరియర్స్, పిఆర్సి, రిటైర్మెంట్ అరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘ సభ్యులు చేరే వారికి ఈకేవైసీ గడువు పెంచాలన్నారు. జిల్లా ట్రెజరీ పరిధిలోని 17వేల పెన్షనర్లకుగాను కేవలం నేటికీ 7వేల మంది పెన్షనర్లు మాత్రమే ఈకేవైసీ చేసుకున్నారని, ఒక్క తిరుపతిలోనే రెండు వేల మంది పెన్షనర్లకు ఈకేవైసీ పెండింగ్లో ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈకేవైసీ ఈనెల 10 తేది వరకు సడలింపునిస్తూ నిబంధనలతో పెన్షనర్లు పై ఒత్తిడి తెస్తున్న ఫలితంగా వేలాది మంది పెన్షనర్లకు ఆందోళనకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రైవేట్ కళాశాలల గుర్తింపు సకాలంలో పూర్తి చేయాలి




**ప్రజాశక్తి-తిరుపతి టౌన్ :** జిల్లాలో ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల అఫిలియేషన్, గుర్తింపు కాల పరిమితి పొడిగింపు కొరకు 2023-24 సంవత్సరానికి గాను ఈ నెల 31 లోపు పూర్తి స్థాయిలో తనిఖీ చేసి నివేదికలు రాష్ట్రస్థాయి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వారికి మే నెల 31 లోపు పంపేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె వెంకట రమణరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నందు ఏర్పాటుచేసిన ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కు సంబంధించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ చైర్మన్ హెూదాలో మాట్లాడుతూ జిల్లాలోని 40 ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల అఫిలియేషన్, గుర్తింపు, కాల పరిమితి పొడిగింపు కొరకు 2023-24 సంవత్సరానికి గాను ఈ నెల 31 లోపు పూర్తి స్థాయిలో తనిఖీ చేసి నివేదికలు రాష్ట్ర స్థాయి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వారికి పంపేలా ఆర్ఐఓ, డివిఈఓ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రభుత్వం నుండి అందిన మొబైల్ యాప్ లో చెక్ లిస్ట్ మేరకు వివిధ శాఖలకు సంబంధించిన అంశాలు కళాశాలలో ఉండాల్సిన మౌలిక సదుపాయాలు, అనుమతి పత్రాలు నిబంధనల మేరకు ఉన్నాయా లేదా అని పరిశీలించి పారదర్శకంగా నివేదికలు తయారు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, వెంకట్రావు డిపిఓ రాజశేఖర్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# కళాకారుల విడిది కేంద్రం 'అందరి ఇల్లు'

### వేడుకగా అన్నమయ్య జయంతి ఉత్సవాలు

**ప్రజాశక్తి-తిరుపతి:**

తిరుమల కొండపై శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల ఇంటిని పునర్నిర్మించాలని, కళాకారుల విడిది కేంద్రమైన మంగళంలోని బిటిఆర్ కాలనీలోని 'అందరి ఇల్లు'ను ఉపయోగించుకోవాలని, జానపద కళలను కాపాడుకోవాలని వక్తలు ఉద్ఘాటించారు. తిరుపతి మంగళంలోని బిటిఆర్ కాలనీలోని అన్నమయ్య కళాక్షేత్రంలో అన్నమయ్య 615 వ జయంతి ఉత్సవాలను మంగళవారం ఉదయం వేడుకగా ప్రారంభించారు. తొలుతగా అన్నమాచార్యుల చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. చిత్తూరు, తిరుపతి, సత్యసాయి జిల్లాల వ్యాప్తంగా వచ్చిన కళాకారులు తమ కళారూపాలతో కన్నుల పండుగగా ప్రదర్శనలు ఇచ్చారు. జానపద వత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జగన్మోహన్రావు, బంగారు మురళి మాట్లాడుతూ... భజన సంప్రదాయానికి ఆద్యుడు అన్నమయ్య అని ఆయన జ్ఞాపకంగా మంగళంలో ఏర్పాటు చేసిన అన్నమయ్య కళాక్షేత్రాన్ని సందర్శించి అక్కడున్న 'అందరి ఇల్లులో' విడిది చేయాలని కోరారు. ఇక్కడ కళాకారులకు అవసరమైన వంట సామాగ్రి ఇతర సౌకర్యాలను ఉచితంగానే తాము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కళాకారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘము నేతలు దేవానంద్, నాగరాజు, శంకరయ్య స్వామి, మునిరత్నం, రామారావు , సునీతమ్మ, కేశవయ్య, జైభారత్ సంఘము నేత కులాయప్ప పాల్గొన్నారు.





### షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులు వేలానికి గ్రీన్‌సిగ్నల్

**ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని సుధల గుంట షుగర్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ భూములను స్వాధీన పరుచుకుని చెరుకు సరఫరా చేసిన రైతులకు పాత బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తహశీల్దార్ హనుమంతనాయక్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ యాక్ట్ 1864 సెక్షన్ 28 ప్రకారం షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశామని.. సదరు భూములను వేలం వేసి రైతు బకాయిలను, ప్రభుత్వానికి కట్టా ల్సిన బకా యిలను చెల్లించేందుకు సబ్ రిజిస్ట్రార్ నుంచి భూముల మార్కెట్ విలువ సేకరించినట్లు తెలిపారు.

# 'లీకేజీలు లేకుండా చూడండి'

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** నగరంలో నీటిసరఫరా చేస్తున్న పైపుల్లో లీకేజీలు లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ మిట్టూరు ప్రాంతంలో పలు వీధుల్లో నీటిసరఫరా పైప్‌లైన్లను తనిఖీ చేశారు. పలు ప్రాంతాల్లో నీటి లీకేజీలను గుర్తించి ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. ఎక్కడా పైప్‌లైన్లలో లీకేజీ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి వధా అరికట్టడం, నీరు కలుషితం కాకుండా చూడడంలో భాగంగా లీకేజీలకు వేగంగా మరమ్మతులు చేపట్టాలని, ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఫిట్టర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. నగరంలో 50వ వార్డుల పరిధిలోనూ నీటి సరఫరా పైపుల పరిస్థితి, లీకేజీలు, నివారణకు తీసుకుంటున్న చర్యలపై సత్వరం నివేదిక ఇవ్వాలని డీఈలు, ఏఈలను ఆదేశించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను మరింత మెరుగుపరచాలని పారిశుద్ధ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఈలు రమణ, వెంకటప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య పాల్గొన్నారు.



**డెయిరీ ఆవరణంలో శుభ్రతా పనులు వేగవంతం**

నగరంలోని విజయ డెయిరీ ఆవరణంలో జరుగుతున్న శుభ్రత పనులు వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. విజయ డెయిరీ ఆవరణంలో జరుగుతున్న పనులను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. డెయిరీ ఆవరణం, లోపలి రహదారుల్లో పిచ్చిమొక్కలు, ముళ్ళ కంపలు విపరీతంగా పెరిగిపోయింది. వీటిని తొలగించే పనులు గతవారం రోజులుగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. జేసీబీలతో మొక్కలు, పొదలను తొలగిస్తున్నారు. ప్రధాన భవనాలు, దారులను శుభ్రం చేసే పనులను కమిషనర్ పరిశీలించి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పనులను సత్వరం పూర్తిచేయాలని నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ డెయిరీ ఎదురుగా మురుగునీటి కాలువను పరిశీలించారు. కమిషనర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ లోకానాథం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

# మాతమ్మల భూములపై భూస్వాముల కన్ను

**ప్రజాశక్తి-పెళ్లకూరు:** మండలంలోని కానూరురాజుపాలెం అరుంధతి వాడకు చెందిన ఆరుగురు మాతమ్మలకు 2018లో వారి జీవనోపాధి కోసం పలు పథకాలు ప్రవేశపెట్టిన ప్రభుత్వం భూములు పంపిణీ చేసింది. కొనిపాక మాతమ్మ, ఈ.ముత్యాలమ్మ, ఎం.మల్లమ్మ, రేణుక, ఎం.మాతమ్మ, పి.మంజుల లకు అర్ధమాల గ్రామ పంచాయతీ ఫారెస్ట్ ల్యాండ్ పక్కన ఆరు ఎకరాల భూమిని అప్పటి రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించి భూమిని కేటాయించి పాస్ పుస్తకాలు మంజూరు చేశారు. పాసు పుస్తకాలు పొందిన మాతమ్మలు క్రాప్ లోన్ తెచ్చుకొని వారికి ఇచ్చిన పొలంలో ఒకటిన్నర సంవత్సర కాలం పాటు శ్రమించి సాగు చేపట్టారు. 2018 నుంచి సాగు చేస్తూనే ఉన్నారు. 2022 నవంబర్‌లో పంట వేసి 2023 ఫిబ్రవరి మొదటి వారంలో పంట కోశారు. అయితే పెళ్లకూరు మండలంతో సంబంధం లేని వేరే మండలంలోని ఆలత్తూరు గ్రామానికి చెందిన సన్నాడి ప్రసాద్‌రెడ్డి పొలము తనది అంటూ మాతమ్మలకు నోటీసులు పంపి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై పెళ్లకూరు తహశీల్దారు దష్టికి తీసుకెళ్లామని.. గత కొన్నేళుగా కష్టాలు పడి సాగు చేసుకున్న పొలం తమకు దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## తిరుపతి గంగమ్మ జాతర మొదలయ్యిందోచ్..!



**ప్రజాశక్తి-తిరుపతి టౌన్:** శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన చాటింపు ప్రక్రియతో జాతర మొదలయ్యింది. మంగళవారం ఉదయం 8 గంటలకు తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి , తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష , డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ చేతుల మీదుగా చాటింపు సందర్భంగా కోడి స్తంభానికి అభిషేకం చేసి వడిబాల కట్టడంతో జాతర మొదలయ్యింది. ఉదయం 9.30 నిమిషాలకు శ్రీశ్రీశ్రీ దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారు ఆలయానికి అమ్మవారి దర్శనానికి విచ్చేసినారు. అనంతరం ఉదయం 10.30 నిమిషాలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. మద్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కట్టా గోపి యాదవ్, ఆలయ కార్యనిర్వహణాధికారి యం.ముని కష్ణయ్య పాల్గొన్నారు. గంగమ్మ సారె ఊరేగింపు మార్గాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు.

## 'అటల్ టింకరింగ్ ల్యాబ్'లో వేసవి శిక్షణ





శిక్షణా శిబిరంలో విద్యార్థిని సత్కరిస్తున్న డిఇఒ


**ప్రజాశక్తి - వరదయ్యపాలెం:** తిరుపతి జిల్లా వరదయ్యపాళెంలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ జడ్‌పిహెచ్ఎస్ స్కూల్లో నాలుగు రోజుల పాటు వేసవి శిక్షణ కార్యక్రమాన్ని అటల్ జిల్లా నోడల్ అధికారి మేఘనాథ్ పర్యవేక్షణలో మంగళవారం ప్రారంభించారు. నూతనంగా ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో వేసవి శిక్షణ కార్యక్రమం జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏడు జిల్లాలలో, జిల్లాకు ఒక పాఠశాల చొప్పున ఎంపిక చేసింది. విజ్ఞాన్ ఆశ్రమం పూణే, యూనిసెఫ్, ఎస్ సి ఆర్ టి నీతి అయోగ్ సంస్థల సౌజన్యంతో విద్యార్థులకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన ప్రాజెక్ట్ డాక్యుమెంటేషన్, 3డి ప్రింటింగ్, మెకానికల్ టూల్స్, బేసిక్ ఎలక్ట్రానిక్స్, అడ్వాన్డ్స్ ఎలక్ట్రానిక్స్ పై శిక్షణ ఇస్తున్నారు. నాలుగు రోజులపాటు నేర్చుకున్న అంశాల పై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ధృవపత్రాలను అందజేస్తారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్ హాజరై విద్యార్థులు పొందుతున్న తర్ఫీదును ఆసక్తిగా పరిశీలించారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన ఝాన్సీ, గ్రీష్మకుమారిలను డిఇఒ ఘనంగా సన్మానించి అభినందించారు. జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, శిక్షకులు వెంకటేష్, పురుషోత్తం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ బాబు పాల్గొన్నారు.

## 'జగనన్నకు చెబుదాం' టోల్‌ఫ్రీ నంబర్ 1902

**ప్రజాశక్తి-తిరుపతి టౌన్:** 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమం ఒక వినూత్నమైన ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, టోల్ ఫ్రీ నంబర్ 1902 నంబర్ పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని, స్పందన గ్రీవెన్స్ కు మెరుగులు దిద్ది ప్రజల సమస్యలకు నాణ్యమైన, సత్వర పరిష్కారం కొరకే ఈ జగనన్నకు చెబుదాం అని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ప్రారంభించారు. అన్ని జిల్లాల నుంచి కలెక్టర్లు, జేసీలు, ఎస్పిలు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వివక్షలేని, అవినీతి లేని పారదర్శక పాలన, అర్హులైన లబ్ధిదారులకు నిజాయితీగా సంక్షేమ ఫలాలు అందించే దిశలో ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. తిరుపతి జిల్లా నుండి కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి, జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, జెసి డి కె బాలాజీ, జిల్లా అధికారులతో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హాజరయ్యారు. జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ముఖ్య మంత్రి సందేశాన్ని వీక్షించారు. డిఆర్ఓ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీలు కులశేఖర్, వెంకట్రావ్ పాల్గొన్నారు.




## తహశీల్దారుకు సత్కారం



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ : బుచ్చినాయుడుకండ్రిగ తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన హనుమాన్‌నాయక్‌ను ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పూలమాల, శాలువాతో సత్కరించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని.. అవినీతి జరగకుండా ప్రభుత్వం ఇస్తున్న ఇళ్ల పట్టాలను ప్రజలకు నిష్పక్షపాతంగా అందించాలనామ్నరు. పాత్రికేయులకు న్యాయం చేయాలని కోరారు. మండలంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు ప్రసాద్‌నాయుడు, మనం రిపోర్టర్ శ్రీనివాసులు, స్వర్ణసాగరం రిపోర్టర్ దయాకర్, సింహపురి టుడే రిపోర్టర్ కోటేశ్వరరావు, వైయస్ ఆనంద్, ప్రెస్ క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షల ఫలితాలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయ్‌కుమారి తెలిపారు. రోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని.. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. జూన్ రెండో తేదీ జరగబోవు సప్లమెంటరీ పరీక్షలకు విద్యార్థులందరూ సిద్ధంగా ఉండాలని తెలిపారు.

## వ్యవసాయ మోటార్ల విద్యుత్తు తీగల చోరీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని కారనిమిట్ట పంచాయతీలో వ్యవసాయ మోటార్ వైర్లు, స్టాటర్లు చోరీకి గురయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో గతంలో రెండు, మూడుసార్లు చోరీలు జరిగాయి. పోలీసులు దొంగలను పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. మళ్లీ ఇప్పుడు చోరీ జరగడంతో రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం అన్నారు. స్థానిక కార్వేటినగరం రోడ్డులోని ఆటో కార్మికుల సమావేశం కేబీఆర్‌పురంలో వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి తంజావూరు మురళీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పుత్తూరులోని గేట్ వసూలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకులో ఆటో కార్మికులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటో కార్మికులు వారి సమస్యలపై పోరాటాలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పుత్తూరు ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు విజయ్, పురుషోత్తం, ఆటోనాయకులు ప్రవీణ్ కుమార్, వెంకటేష్, రమేష్, వేలాయుధం, మహేష్, మురుగా, సుధా, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వజ్రమ్మ నిరసన



ప్రజాశక్తి-ఓజిలి: అకారణంగా తొలగించిన వజ్రమ్మను విధుల్లోకి తీసుకోవాలని గత 15 రోజులుగా సిఐటియు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్నారు. మధ్యాహ్న భోజన కార్మికురాలు వజ్రమ్మకు వెంకటగిరి మధ్యాహ్న భోజన కార్మికులు మద్దతుగా నిలిచి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులను అణిచివేసే ధోరణిని అనుసరిస్తున్న విద్యాశాఖ అధికారిణిపై చర్యలు చేపట్టాలని.. లేనిపక్షంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘాలు తీవ్ర ఉద్యమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి.చంగయ్య , సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ముకుంద, ఐద్వా నాయకురాలు చంద్రకళ , మధ్యాహ్నం భోజనం కార్మికులు లీలావతి, జయమ్మ, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో ఆటల పోటీలు



ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని మంచినీళ్లగుంట వద్ద ఉన్న గ్రంథాలయంలో మంగళవారం పిల్లలకు కథలు, పద్యాలు, పాటలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఉదయం 8.30 నుంచి 12 గంటల వరకు లైబ్రరీలో వేసవి తరగతులు జరుగుతాయని.. తల్లిదండ్రులు తమ పిల్లలను పాల్గొనేలా చేయాలని విద్యా వికాస వేదిక కన్వీనర్ వెంకటరమణ కోరారు.

## కూలీ మృతికి పరిహారం అందించాలి

ప్రజాశక్తి-రేణిగుంట: యర్రావారిపాళెం మండలం నెరబైలు పంచాయతీలోని ఎస్టీ కాలనీలో ఉపాధి కూలీ శ్రీనివాసులు మతి చెందాడని..ఇతనికి ముగ్గురు పిల్లలు ఉన్నారని.. ప్రభుత్వం స్పందించి రూ.5 లక్షలు పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. హరినాథ్ డిమాండ్ చేశారు. ఏపీవోను వివరణ కోరగా తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పడం దారుణమన్నారు. జాబ్‌కార్డు లేకుండా పని చేయించుకోవడం నేరమని.. జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

# రైళ్లల్లో సమస్యలు.. ట్విట్టర్‌తో పరిష్కారం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

రైల్వేశాఖ ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడమే కాకుండ మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తోంది. ప్రయాణ సమయంలో ఇబ్బందులు తలెత్తితే రైల్వే పోలీసులు ద్వారా పరిష్కరిస్తు అండగా నిలుస్తోంది. ఇళ్ల నుంచి పారిపోయిన పిల్లలను గుర్తించడం, ఆర్యోగం దెబ్బతిన్న వారికి ఆసుపత్రి తరలించడం, బోగిల్లో ఆపరిశుభ్ర పరిస్థితులు, మర్చిపోయిన వస్తువులు జాగ్రత్తచేయడం, దొంగతనాలపై తక్షణం స్పందిస్తోంది. ప్రయాణికుల వాట్సాప్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్,ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను వినియోగించి ఆయా సమస్యలను తెలయజేస్తే వెంటనే పరిష్కారం చెబుతున్నారు.



**ట్విటర్‌కు ప్రాధాన్యం :** రైల్వేశాఖ ట్విటర్‌కు ఎక్కువ ప్రాధాన్యమిస్తు సమస్యల పరిష్కరానికి వేధికగా మార్చుకుంది. దక్షణమధ్య రైల్వే సికింద్రబాద్ కేంద్రంగా గుంతకల్లు డివిజన్ పరిధిలో తిరుపతి,కడపమార్గంలో 50కిపైగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. గత జనవరి నెలల్లో ఓ ప్రయాణికుడు తిరుపతి నుంచి చెన్నై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రైలులో బాత్‌రూం ఆపరిశుభ్రంగా ఉందని ట్విటర్‌లో ట్విట్ చేశారు. వెంటనే అధికార్లు స్పందించి పుత్తూరు స్టేషన్‌లో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

**139 కాల్‌చేస్తే చాలు:** స్టేషన్‌కు రైలు వచ్చిన సమయంలో బ్యాగులు మరిచిపోయి ఎక్కడం,రైలు దిగే సమయంలో ఆత్రుతతో విలువైన సామగ్రి ,బ్యాగులు మర్చిపోవడం జరుగుతుంది. ఆయా సందర్భాలల్లో దిగులు పడకుండ వెంటనే స్టేషన్‌లోని రైల్వే పోలిసులుకు గాని ,139 నెంబర్‌కు కాల్‌చేయాలి. దానికి దిల్లిలోని ప్రధాన కార్యాలయ అధికార్లుస్పందించి వారుఫోన్ కాల్ ఆధారంగా ఆయా డివిజన్ పరిధిలోని సంబంధిత స్టేషన్‌కు కలుపుతారు. సిబ్బందిని సమన్వయం చేసుకోని సమస్య పరిష్కరించే దిశగా కృషిచేస్తారు.తిరుపతి వాసి నగేష్ ఈఏడాది జనవరి నెలల్లో గుంతకల్లుకు రైల్లో వెళ్లుతుండగా కడప సమీపంలో తనఫోన్ పొరపాటున కిందపడిపోయింది. వెంటనే 139కు ఫోన్ చేసి వివరాలు తెలపగా కొన్ని గంటల్లో ఫోన్ దోరికిందని రైల్వే పోలిసులు నుంచి సమాచారం వచ్చింది.

**మహిళాలకు రక్షణ :** మహిళలపై రైళ్లలో ఈవ్‌టిజింగ్ జరిగిన, బోగిల్లో రక్షణ లేదని బావించినా నేరుగా రైల్ మదద్‌యాప్‌లో ఫీర్యాదు చేయవచ్చు.139 నెంబర్‌కు కాల్ చేయడం, స్టేషన్‌లోని రైల్వే పోలిసులుకు పిర్యాదు చేయడం కూడా చేయవచ్చు. పోలిసుల రక్షణ పొందవచ్చు. అవసరమైతే బెర్తును మార్చుకుని సురక్షిత బోగిలోకి వెళ్లే వీలు కల్పిస్తారు.

**ట్విటర్ ఖాతాలు:** జీఎం సౌత్‌సెంట్రల్‌రైల్వేస్, డిఆర్‌ఎం సికింద్రాబాద్, ఆర్‌పిఎఫ్ ఎస్‌సిఆర్, ఆర్‌పిఎఫ్ ఎస్‌సిఆర్-1,జీఆర్‌పి ఎస్‌సిఆర్, జీఆర్‌పి సికింద్రాబాద్

**వెబ్‌సైట్లు:** డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్‌సిఆర్. ఇండియన్ రైల్వేస్.జీవోవి.ఇన్, ఎస్‌సిఆర్‌ఆర్‌ఎఐ ఎల్‌డబ్ల్యుఐ ఎన్‌డిఐఏ, సౌత్‌సెంట్రల్‌రైల్వే రైల్వేస్- ఎస్.సి.ఆర్, ఫేస్‌బుక్, (యాప్) రైల్వేమదాద్.

## హేమాద్రి కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తడుకు పంచాయతీ తిరుమలరాజుకండ్రిగ గ్రామానికి చెందిన హేమాద్రిరాజు గుండెపోటుతో మతిచెందారు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ గ్రామానికి చేరుకుని హేమాద్రి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. గంగాధరం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగరత్నం జన్మదిన వేడుకలు




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నగరి నియోజకవర్గ తెలుగు మహిళా జనరల్ సెక్రటరీ నాగరత్నం జన్మదిన వేడుకలను మంగళవారం పుత్తూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో ఘనంగా జరిగింది. కేక్ కోయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, ఎస్సీసెల్ అధ్యక్షులు ఆనంగి ఆనంద్, 27వ వార్డు కౌన్సిలర్ బసంతి, మోహనా, రజిని, డీజీ ధనపాల్, వెంకటేష్, ఈశ్వర్ యాదవ్, హమీద్ బాషా, కష్ణ కుమార్, ఉమా శంకర్ రెడ్డి, శ్రీనివాసులు, జానకి రామయ్య, అఖిల్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు భోజనాల పంపిణీ



ప్రజాశక్తి-గూడూర్ రూరల్ : గూడూరు జేవీవీ ఆధ్వర్యంలో వి.కె.షోరూం అధినేత మల్లికార్జున దాతత్వంలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు భోజనాలు పంపిణీ చేశారు. డాక్టర్ రేణుకాదేవి చేతుల మీదుగా అందించారు. జె.వి.వి.ఉపాధ్యక్షులు చెంచునారాయణ మాట్లాడుతూ జే.వి.వి. ఆధ్వర్యంలో గత 9 సంవత్సరాలుగా భోజనాలు పంపిణీ చేస్తున్నామని.. దాత మల్లికార్జున్‌ను అభినందించారు. కార్యక్రమంలో జే.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, పురుషోత్తమరావు, ప్రభాకర్, కటకం శ్రీను, జగదీష్, అశోక్, విష్ణు, మురళీసింగ్, సుబ్రమణ్యం, గుర్రం విజయ్ బాబు, రమేష్, వెంకట్ , సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయ చీఫ్ అకౌంట్ ఆఫీసర్‌గా నారాయణ



ప్రజాశక్తి -కోట :మండలంలోని వెంకన్నపాలెంకు చెందిన టి.నారాయణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కు చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా, ఫైనాన్సియల్ అడ్వైజర్ గా ప్రభుత్వం నియమించడంపై వెంకన్నపాలెం సర్పంచ్ మధు అభినందనలు తెలిపారు. నారాయణ వెంకన్నపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి కావడం గర్వకారణమన్నారు. వెంకన్నపాలెం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## వీరభద్రస్వామి ఆలయంలో అన్నదానం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణం త్యాగరాజ వీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి విశేష పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మువ్వా సురేష్‌బాబు ఉభయ దారులుగా వ్యవహరించారు.

## వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



ప్రజాశక్తి- గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నెల్లూరు జిల్లా క్రికెటర్ అసోసియేషన్, గూడూరు క్రికెట్ క్లబ్ , అల్లూరు ఆదిశేషారెడ్డి , కనుమూరు హరిశ్చంద్రారెడ్డి క్రికెట్ క్లబ్ , సంయుక్తంగా క్రికెట్ కోచింగ్ క్యాంప్‌ను మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు క్రికెట్ ఆడి కోచింగ్‌ను ప్రారంభించి మాట్లాడారు. చిన్నతనం నుంచి క్రీడలపై పట్టుసాధించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ జనార్దన్‌రెడ్డి , మునిగిరీష్ , లవకుమార్ , వెంకటరమణయ్య పాల్గొన్నారు.

## ఐసర్ వలస కార్మికులను ఆదుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్ద ఐసర్ శాశ్వత భవనాల నిర్మాణంలో పనిచేస్తున్న భవన నిర్మాణ రంగ వలస కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఏఐటీయూసీ నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఐసర్ భవన నిర్మాణాలకు డీఈసీ కంపెనీ సుమారు 3 వేల మందికి పైగా ఒరిస్సా, మధ్యప్రదేశ్, బీహార్, చండీగర్ పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులచే పని చేయిస్తోందన్నారు. అయితే వారి వివరాలు రెవెన్యూ అధికారుల వద్ద గాని, అటు లేబర్ కార్యాలయంలో గాని వారి పేర్లు నమోదు లేదని వాపోయారు. వలస కార్మికుల చట్ట ప్రకారం కార్మికులకు మౌలిక సదుపాయాలతో పాటు నివాస ప్రాంతం విద్య వైద్య సదుపాయాలు కల్పించాల్సి ఉంది అన్నారు. అయితే ఐసర్ వద్ద అలాంటి సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రేకుల షెడ్లలో నిర్బంధించి సదరు కంపెనీ కాంట్రాక్టర్లు వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల కొట్టం కన్నా దారుణంగా కార్మిక నివాస ప్రాంతాలు ఉన్నాయనీ, కనీసం మరుగు లేక కాల కత్యాల సైతం బహిరంగంగానే నిర్వహించుకోవలసిన దుస్థితి అక్కడ ఏర్పడింది అన్నారు. కార్మికులకు కనీసం పిఎఫ్, ఈఎస్ఐ ఐడి కార్డులు కూడా లేవని ఆవేద వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి కలెక్టర్ అదేవిధంగా, జిల్లా లేబర్ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి వలస కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో పోరాటక కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు జనమాన గురవయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వైఎస్ మణి, రేణిగుంట మండల నాయకులు మోహన్ రెడ్డి మోహన్ రెడ్డి, కార్తీక్, పి సల్వా, శ్రీకాళహస్తి పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



ప్రజాశక్తి-గూడూరు: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని.. ప్రజల్లోకి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం గూడూరులోని 29వ వార్డులో 'ఇదేం ఖర్మ..మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ గెలవడం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పట్టణం అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు చెంచురామయ్య, యూనిట్ ఇన్‌ఛార్జి తాతపూడి ఇశ్రాయల్ కుమార్, మైనారిటీ నాయకులు చాన్ బాషా, మాజీ కౌన్సిలర్ కరీముల్లా, అబ్దుల్ రహీం, బూత్ కన్వీనర్ ఫక్రుద్దీన్, మాజీ కౌన్సిలర్లు గాయం రమణయ్య, నేరెళ్ల రత్నం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## చదువుతోపాటు సంస్కారం అవసరం

ప్రజాశక్తి-రేణిగుంట: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వేసవి ఉచిత సమ్మర్ క్యాంపు ప్రారంభించినట్లు ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్ధాల రవిబాబు తెలిపారు. మంగళవారం రేణిగుంట మండలం ఆర్ మల్లవరం పంచాయతీ కుమ్మరపల్లి ప్రాథమిక పాఠశాలలో అభయ ఫౌండేషన్ హైదరాబాద్, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వేసవి వెన్నెల ఉచిత సమ్మర్ క్యాంపును సర్పంచ్ ఆవుల ముని వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్ధాల రవిబాబు మాట్లాడుతూ అభయ ఫౌండేషన్ అధినేత సుంకా బాలచందర్‌స్వామి గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వేసవి వెన్నెల ఉచిత సమ్మర్ క్యాంపును మే 9 నుంచి జూన్ 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చదువుతోపాటు సంస్కారం, మానవీయ విలువలు, తల్లిదండ్రుల ప్రాముఖ్యత, ప్రార్థన శ్లోకాలు, భగవద్గీత, భజగోవిందం, వేమన, సుమతీ శతకాలు, దేశభక్తి గీతాలు నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో నరేంద్ర, లక్ష్మి , అంగన్వాడి టీచర్ వసంతమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీతో జనుము, జీలుగ విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-గుడిపల్లి: రాయితీతో జనుము, జీలుగ విత్తనాలను 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగరాజు మంగళవారం తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జీలుగ విత్తనాలు 10 కేజీల బ్యాగు 50 శాతం రాయితీ పోను రూ.395 లకు, జనుము 10 కేజీల బ్యాగు 50 శాతం రాయితీ పోను రూ.420 లకు రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ పచ్చ రొట్టె ఎరువులను వర్షాలు పడిన వెంటనే నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు ఎకరాకు 10 నుంచి 12 కేజీలు చొప్పున విత్తుకొని 45 రోజుల తర్వాత పంట బాగా పెరిగి నాలుగు నుంచి ఐదు టన్నుల పచ్చి రొట్టె ఎరువుగా మారుతుందన్నారు. వీటిని పూత దశలో ఉన్నప్పుడు రోటవేటర్ సహాయంతో పొలంలోకి కలియ దున్నడంతో ఈ పచ్చ రొట్టె ఎరువులు భూమిలో బాగా కలిసిపోయి రాబోయే పంటలకు నేలను బాగా సారవంతం చేసి, నత్రజని భాస్వరం ఎరువులను, జింక్, కాల్షియం ఇనుము వంటి సూక్ష్మ పోషకాలను కూడా నేలకు అందజేస్తాయన్నారు. అదేవిధంగా నేల సహజ మిత్రులైన వానపాములను పెంచి, నేల నీటిని పట్టుకునే సామర్థ్యాన్ని కూడా పెంచుతాయని తెలిపారు. ఇవి లెగ్యూమ్ జాతికి చెందినవి కాబట్టి నత్రజని స్థిరీకరణ కూడా చేస్తాయని చెప్పారు. కావున రైతులందరూ ఈ జనుము, జీలుగలు పెంచి నేల సారమును పెంచుకొని తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు పొందాలని తెలిపారు. రైతులు, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్వో ప్లాంట్ పనుల పరిశీలన



ప్రజాశక్తి-రొంపిచెర్ల: స్థానిక సచివాలయం-1 వద్ద గ్రామ మంత్రి పెద్దిరెడ్డి మంజూరు చేసిన 4000 లీటర్ల ఆర్వో ప్లాంట్ పనులను సర్పంచ్ ఇబ్రహీంఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ త్వరలో మంత్రిచే ప్రారం భించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. వైసీపీ నాయకులు చిన్న నాగరాజ, శ్రీపతి, కరీముల్లా పాల్గొన్నారు.

## రూ.6 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: అటవీశాఖ అధికారులకు అందిన రహస్య సమాచారం మేరకు భాకరాపేట రేంజ్ అధికారుల ఆదేశాలతో తలకోన నార్త్ బీట్ అటవీ సమీపంలో అక్రమంగా ఎర్రచందనం రవాణా చేస్తుండగా మంగళవారం అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. సుమారు రూ.6 లక్షలు విలువ ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్‌ఎస్‌వో సలావుద్దీన్ తెలిపారు. దాడుల్లో రాజేష్, ప్రదీప్ చాంద్, నిఖిల్, క్యాంప్ ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: పీలేరు-తిరుపతి జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. భాకరాపేట సమీపంలోని మఠంగడ్డ వడ్డిపల్లికి చెందిన దిలీప్(21), సునీల్ కుమార్(19) రొంపిచెర్లలో సెంట్రింగ్ పనులు ముగించుకొని స్వగ్రామం మఠంగడ్డ వడ్డిపల్లికి బయదేరారు. చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై ఉన్న గంగమ్మ గుడి మలపు వద్ద అదుపు తప్పి పడ్డారు. ప్రమాదంలో దిలీప్ తీవ్రంగా గాయపడగా సునీల్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమచికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. భాకరాపేట ఎస్సై ప్రకాష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పోస్టల్ ఉద్యోగుల నిరసన



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఎన్.ఎఫ్.పి.ఈ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్.ఎఫ్.పి.ఈ గూడూరు డివిజన్ అధ్యక్షుడు ఆర్.గోవిందనాయక్, పెన్షనర్ సెక్రెటరీ సుధాకర్ మాటాడుతూ ఎన్.ఎఫ్.పి.ఈ, గ్రూప్-సి రద్దును నిరసిస్తూ దేశ వ్యాప్తంగా అన్ని డివిజనల్ కార్యాలయాలు ఎదుట నిరసన తెలిపామన్నారు. తమ సంస్థ పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిందన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకొని సంఘాల గుర్తింపును వెంటనే పునరుద్ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్.ఎఫ్.పి.ఈ సభ్యులు పాల్గొన్నారు.

## చెంబేడు హైస్కూల్లో సంబరాలు



ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని చెంబేడు జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం విద్యా కమిటీ ఛైర్మన్ యోగేశ్వరయ్య ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పదో తరగతి ఫలితాలకు సంబంధించిన ఇష్టాగోష్టి నిర్వహించారు. గ్రామస్థులు ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. విద్యా కమిటీ ఛైర్మన్ ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషి ఫలితంగా పదోతగరతిలో మంచి ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. వారిని అభినందించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు.

## వైసీపీలోకి టీడీపీ నాయకుల చేరిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణంలోని 16వ వార్డుకు చెందిన పలువురు టిడిపి నాయకులు మంగళవారం వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సాదర ఆహ్వానం పలికి పార్టీ కండువా కప్పారు. లాల్ బాషా, అహ్మద్, సలీమ్, ,ముబారక్, తిరుపతి జిల్లా హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ అబ్దుల్ కలీంలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

## పేదల అభివృద్ధికి ముఖ్యమంత్రి చేయూత

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: బడుగు వర్గాల అభివృద్ధికి వివిధ పథకాలతో సీఎం జగన్ మోహన్ రెడ్డి చేయూత అందించారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నెల్లేపల్లి పంచాయతీలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక సర్పంచ్ రవీంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని కొనసా గించారు. ఈ సందర్భంగా చిన్నమెట్టపల్లి, పెద్దమిట్టపల్లి, నెల్లేపల్లి దళితవాడ, నెల్లేపల్లి, బొబ్బిగానిపల్లె తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఇన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపట్టలేదని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రమే ప్రతి లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాలో నిధులు జమ చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, ఎంపీడీఓ శ్రీదేవి, తహశీల్దార్ ఇన్నునాధన్, సీడీపీఓ వినతి శ్రీ, మండల వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, పలువురు అధికారులు, నేతలు పాల్గొన్నారు.

## గొర్రెల దొడ్డిలో కొండచిలువ



ప్రజాశక్తి-సోమల: గొర్రెల దొడ్డిలో కొండచిలువ పామును చూసిన గ్రామస్తులు భయభ్రాంతులకు గు రై, దానిని కొట్టి చంపిన సంఘటన మంగళవారం ఇరికిపెంట పంచా యతీలో చోటుచేసుకుంది. వివరా లు.. ఇరికిపెంట పంచాయతీ పార్వ తి నగర్ గ్రామంలోని వెంకటరామ య్య గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగించేవాడు. రోజులాగే మంగళవారం గొర్రెలను మేతకు తోలుదామని గొర్రెల దొడ్డిలోకి వెళ్లి చూడగా కొండచిలువ కనిపించడం తో భయంతో పరుగులు తీశాడు. ఈ విషయం గ్రామంలో తెలియ డంతో గ్రామస్తులు కొండచిలువను కర్రలతో కొట్టి చంపారు. కొండచిలువ 10 అడుగులకు పైగా ఉంద ని, ఎలా, ఎప్పుడు వచ్చిందో అని గ్రామస్తులు మాట్లాడుకోవడం కనిపించింది.